క్లుప్తంగా

5కె రన్‌లో ప్రతిభ



కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం నగదు అదుకుంటున్న అజయ్‌కుమార్

సీతానగరం: జిల్లా కేంద్రంలో యూత్ ఫెస్ట్ ఆధ్వర్యంలో 2025–26 కు గాను నిర్వహించిన 5కె రన్‌లో పాల్గొన్న సీతానగరం మండలకేంద్రంలోని మెట్టువీధికి చెందిన అజయ్ కుమార్ ద్వితీయ స్థానం సాధించాడు. ఇటీవల పార్వతీపురంలో నిర్వహించిన 5కె రన్‌లో ద్వితీయస్థానం సాధించిన అజయ్‌కుమార్ కలెక్టర్ చేతుల మీదుగా రూ.7వేల నగదు ప్రోత్సాహక బహుతి అందుకున్నాడు. ఈ సందర్భంగా ద్వితీయ స్థానం సాధించిన అజయ్‌కుమార్‌కు గ్రామస్తులు, స్థానిక ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

మహిళను కాపాడిన పోలీసులు

పార్వతీపురం రూరల్: గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తగూడ గ్రామానికి చెందిన ఆరిక భారతి (భాను) తన భర్త సవర పెంటయ్య(గౌతమ్)తో గొడవపడి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని చనిపోవాలనే ఉద్దేశంతో కురుపాం నుంచి బయలుదేరి పార్వతీపురం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రైలు కింద పడి తాను చనిపోవాలనుకుంటున్న విషయాన్ని తానే నేరుగా 112కు కాల్ చేసి సమాచారం ఇచ్చింది. దీంతో స్పందించిన పార్వతీపురం శక్తి టీమ్ సభ్యులు గురుమూర్తి, రామలక్ష్మిలు బెలగాం రైల్వే స్టేషన్‌కు చేరుకుని అప్పటికే పట్టాల దగ్గరలో ఉన్న ఆమెను గుర్తించి నచ్చచెప్పారు. వెంటనే ఆమె భర్తను పిలిపించి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ మేరకు 112 కాల్‌కు స్పందించి మహిళ ప్రాణాలను కాపాడిన శక్తి టీమ్ బృందాన్ని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అభినందించారు.

410మంది విద్యార్థులకు తనిఖీలు

బలిజిపేట: జాతీయ అంధత్వ నివారణ ప్రోగ్రాంలో భాగంగా బలిజిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో 410మంది విద్యార్థులకు మంగళవారం కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. తనిఖీలు నిర్వహించిన వారిలో 12మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. విద్యార్థులు కంటిచూపు మందగించకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ, మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆప్తాలమిక్ రమేష్ సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటినాయుడు, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, ఏఎన్‌ఎం వేదప్రియ, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ పరిశీలన



ఇప్పలవలసలో ఎరువులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలో ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన యూరియా పంపణీ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని మండల ప్రత్యేక అధికారి, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఇప్పలవలస రైతుసేవా కేంద్రంలో మండల ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో మంగళవారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. గ్రామాల్లో రైతులకు అవసరమైన ఎరువులు ఇవ్వకుండా ఒక్కోబస్తావంతున యూరియా పంపిణీ చేయడంపై అధికారులను విమర్శించారు. ఏఓ అవినాష్ మాట్లాడుతూ రెండు రోజుల్లో రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కుమారవర్మ, వ్యవసాయ, పీఏసీఎస్ అధికార సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు సక్రమంగా వేయాలి

- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి విజయమోహన్



బలిజిపేట పీహెచ్‌సీలో టీకాలు నిల్వచేసే ఐఎల్ఆర్‌ను పరిశీలిస్తున్న అధికారి

బలిజిపేట: టీకాలు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని, సమయానుకూలంగా వాటిని వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి విజయమోహన్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీని ఆయన మంగళవారం పర్యవేక్షించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమాని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు కొన్ని సూచనలు అందించి ప్రాధాన్యతను వివరించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. టీకాలు నిల్వచేసే ఐఎల్ఆర్‌ను పరిశీలించి టీకాలను ఏవిధంగా జాగ్రత్తగా ఉంచాలో సిబ్బందికి వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా ఎక్స్‌టర్నల్ ఎసెస్‌మెంట్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతన్న

ప్రభుత్వ బెదిరింపులకు భయపడలేదు. పోలీసుల ఆంక్షలకు తలొగ్గలేదు. సమస్య పరిష్కరించాలని నినదిస్తూ కదం తొక్కారు. అడుగడుగునా పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నా..ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నా..రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు అన్నదాత పోరులో మంగళవారం పాల్గొని రైతులకు అండగా నిలిచి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

- ధ్వజమెత్తిన అన్నదాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు
- అడుగడుగునా ఆంక్షలతో అన్నదాతపోరు విజయవంతం
- పోలీసుల ఆంక్షల సంకెళ్లు తెంచుకుని కదంతొక్కిన రైతులు
- ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పార్వతీపురంలో అన్నదాత పోరు ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు



అన్నదాత పోరులో రోడ్డుపై బైఠాయించి ఫ్లకార్డులను చూపిస్తున్న మహిళలు

పార్వతీపురం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన అన్నదాతపోరు కార్యక్రమంపై పార్వతీపురం డివిజన్ పరిధిలో పోలీసులు అడుగడుగునా ఆంక్షలతో 30యాక్ట్ అమలులో ఉందంటూ రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్రామాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో స్థానిక నాయకుల ఇళ్లకు పోలీసులు ఉదయం 6గంటల నుంచే చేరుకుని అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించకుండా ఆపేందుకు ప్రయత్నాలు చేశారు. కేవలం 15మందికే అనుమతులు ఉన్నాయంటూ నిరసనలు, ర్యాలీలు చేస్తే అరెస్టు చేస్తామంటూ పోలీసులు బెదిరింపులకు పాల్పడ్డారు. రైతన్నలు ఎదుర్కొంటున్న ఎరువుల కొరత, బ్లాక్‌మార్కెట్ ద్వారా ఎరువుల అమ్మకాలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి పిలుపుతో రైతన్నలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు రైతన్నలతో కలిసి పోలీసుల ఆంక్షల సంకెళ్లు తెంచుకుంటూ ముందుకెళ్లారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరులో రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ నిలవగా కార్యక్రమం విజయవంతమైంది.

ఆక్రందన వినకుండా అడ్డుకుంటారా?

మంగళవారం వేకువజామునుంచి పార్వతీపురం కేంద్రానికి వచ్చేందుకు ఉన్న దారులు, కూడళ్లలో 22చోట్ల పోలీసులు మొహరించి చెక్‌పోస్టులు నిర్వహించి అన్నదాత పోరు కార్యక్రమానికి వచ్చేవారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, స్థానిక మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావులు పూలమాలలు వేసి వారి నేతృత్వంలో అక్కడి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు మొదలైన ర్యాలీని అడుగడుగునా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. అవేమీ లెక్కచేయకుండా అన్నదాత తరఫున గొంతు వినిపించేందుకు శ్రేణులంతా ముందుకు కదిలారు. దీంతో ర్యాలీకి అనుమతులు లేవంటూ ర్యాలీని నిలుపుదల చేసేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. రైతన్నల ఆక్రందనలు వినిపించుకోకుండా కూటమి ప్రభుత్వం ఆదేశాలతో అడ్డుకునే ప్రయత్నాన్ని పోలీసులు చేయడం దారుణమంటూ రైతన్నలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు ఆస్పత్రి కూడలి వరకు చేరుకున్నారు. మరోసారి బారికేడ్లతో పోలీసులు మొహరించి ఎస్‌టీఎఫ్ బలగాలతో అడ్డుకోగా నాయకులు రోడ్డుపై బైఠాయించారు.

కొంతసమయం నిరీక్షణ అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి సబ్‌కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములునాయుడు, స్థానిక మున్సిపల్‌చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జీ, పట్టణ, వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పాలవలస మురళీకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, తప్పిట ప్రసాద్, అధికార ప్రతినిధి మువ్వల సత్యంనాయుడు, రాష్ట్ర బీసీసెల్ విభాగం అధ్యక్షుడు రంగుముద్రి గణపతిరావు, జిల్లా పార్టీ ప్రతినిధులు వివిధ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్రమంతటా అల్లాడుతున్న రైతులు



రాష్ట్రమంతటా రైతులు యూరియా, ఎరువులు సక్రమంగా దొరకక అల్లాడుతున్నారు. ఇటీవల సాలూరు నియోజకవర్గంలో కూర్మరాజుపేటలో యూరియా కోసం వందలాదిమంది రైతులు అవస్థలు పడుతూ వారిలోనే యూరియాకోసం కొట్లాడుకునే దుస్థితి నెలకొంది. పార్వతీపురం, పాలకొండ, కురుపాం ప్రతి నియోజకవర్గంలోను ఇదే పరిస్థితి. 300 బస్తాలు వచ్చేచోట 1500మంది రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఎన్ని ఎకరాలు ఉన్నా ఒక రైతుకు ఒక యూరియా బస్తానే ఇవ్వడం ఎంతవరకు న్యాయం. ఎకరాకి మూడు బస్తాలైనా ఇవ్వాల్సిన నేపథ్యంలో ఇలా అరకొరగా పంపిణీ చేయడం రైతులకు అన్యాయం చేయడమే.

– పీడిక రాజన్నదొర, మాజీ ఉప ముఖ్యమంత్రి

కప్పిపుచ్చుకునే ప్రయత్నం



రాష్ట్రంలో రైతన్నలు ఎరువుల కొరతపై పడుతున్న సమస్యల పరిష్కారానికి రైతన్నల తరఫున శాంతియుతంగా ర్యాలీ చేస్తామంటే ముందు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం మంగళవారం ఉదయం అందరినీ నిర్బంధించి హౌస్ అరెస్టులు చేసి భయాందోళనకు గురిచేశారు. రైతుల తరఫున నిలబడేందుకు ధైర్యంగా ముందుకొచ్చిన నాయకులను, కార్యకర్తలను జిల్లా కేంద్రంలో అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. రైతుల తరఫున తీవ్రమైన ఎరువుల కొరతపై ప్రతిపక్షంగా పోరాటం చేస్తే అదికూడా సమస్య కాదన్నట్లు కప్పిపుచ్చుకునేందుకు చిత్తశుద్ధి లేకుండా అడ్డుకునే ప్రయత్నం చేయడం దారుణం. కూటమి ప్రభుత్వం స్పందించి రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ చేయకుంటే రైతుల తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.

– శత్రుచర్ల పరీక్షిత్ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

ప్రకటనలు తప్ప పంపిణీ ఎక్కడ?



టన్నుల కొద్దీ ఎరువుల నిల్వలు ఉన్నాయంటూ అధికారులు చేస్తున్న ప్రకటనలు రైతులకు యూరియా పంపిణీలో కానరావడం లేదు. ఆర్‌బీకేల్లో యూరియా ఉందంటూ ప్రకటించి తీరా రైతులు వెళ్తే లేదని సమాధానాలు వినబడుతున్నాయి. సక్రమంగా సరిపడా యూరియాను సరఫరా చేయకుండా అరకొరగా పంపిణీ చేస్తూ రైతులను గంటల తరబడి లైన్లలో నిలబెడుతూ అవస్థలకు గురిచేస్తున్నారు. సరిపడా ఎరువులు అందని రైతన్నలు చేసేది ఏమీలేక రూ.750నుంచి రూ. 800 వరకు బస్తాకు అధిక భారాన్ని భరించాల్సి వస్తోంది. ఒక్కోమారు బ్లాక్ మార్కెట్‌లో కూడా ఎరువులు దొరకని పరిస్థితి నెలకొంది. మంత్రి అచ్చెం నాయుడు యూరియా అందకపోతే ఇన్‌సెంటివ్ ఇస్తామని చేసిన వ్యాఖ్యల మేరకు రాష్ట్రంలో ఏ రైతుకైనా ఒక్క రూపాయి ఇన్‌సెంటివ్ ఇచ్చారా అని ప్రశ్నిస్తున్నాం. అరెస్టుల పేరిట బెదిరిస్తే భయపడే ప్రసక్తి లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- సీపీఎం పట్టణ కమిటీ డిమాండ్



మార్కెట్‌యార్డ్ సెక్రటరీ బెవర శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయికులు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డు పశువుల సంతలో ప్రతి గురువారం లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా మౌలిక సదుపాయాలు మాత్రం పిసరంత లేవని సీపీఎం పట్టణ కమిటీ విమర్శించింది. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం స్థానిక మార్కెట్ యార్డ్ సెక్రటరీ బెవర శ్రీనివాసరావుకు సీపీఎం పట్టణ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గల మార్కెట్ యార్డు సంతలో ప్రతి గురువారం పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు ఇలా అనేక రకాల వస్తు వ్యాపారాలు లక్షల్లో జరుగుతున్నాయని, అదే రీతిలో పన్నులు కూడా మార్కెట్ యార్డ్ సిబ్బంది వసూలు చేస్తున్నారన్నారు. సంతలో సమస్య పరిష్కారానికి సోమవారం డీఆర్‌ఓ కె.హేమలతకు వినతి ద్వారా సమాచారం ఇచ్చిన అనంతరం జేసీబీ బ్లేడుతో కాస్త మోతాదులో పైపైన మాత్రమే బురద తొలగించారని, ఎటువంటి శుభ్రతను పాటించలేదని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కనీసం సంతకు వచ్చిన వ్యక్తుల నుంచి వసూలు చేస్తున్న పన్నులకు న్యాయబద్ధ ప్రకారం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న గిరిజనులు, దళితులు, వ్యాపారులకు నీటి చుక్కను కూడా అందివ్వలేని పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది ఉన్నారా? అని ప్రశ్నించారు. వర్షాలు పడితే పూర్తిగా లోనికి వెళ్లలేని పరిస్థితి మార్కెట్ యార్డు మొత్తం ఉంటుందని, దానివల్ల వ్యాపారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున, జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి అధిక మోతాదులో పన్నులు వసూలు చేస్తున్న మార్కెట్ యార్డ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, మంచినీరు పెట్టాలని, మరుగుదొడ్లు నిర్మించాలని మార్కెట్ యార్డ్ రోడ్లు శుభ్రం చేసి కొత్త రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చేవారం సంతలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, ఎస్.ఉమ, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

జగనన్న, రాజన్నదొరలకు ప్రత్యేక ధన్యవాదాలు



మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరను సన్మానిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్న మావుడి శ్రీనువాసులు నాయుడు

సాలూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించినందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరలకు మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనువాసులునాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు పట్టణంలో రాజన్నదొరను ఆయన స్వగృహంలో కలిసి దుశ్శాలువాతో సన్మానించి తన కృతజ్ఞతను చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనువాసులు నాయుడు మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం అప్పగించిన ఈ బాధ్యతను నిబద్ధతతో నెరవేరుస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటానన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసేలా రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏ గుడి దగ్గర యూరియా పంచుతారో?

- నారాయణపురం రైతుల చర్చ



నారాయణపురంలో శివాలయం దగ్గర యూరియా పంపిణీ వద్ద నిరీక్షిస్తున్న రైతులు

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో సోమవారం ఆంజనేయస్వామి గుడి వద్ద, మంగళవారం శివాలయం వద్ద యూరియా పంపిణీ చేశారు. ఒకవేళ మళ్లీ యూరియా వస్తే ఏ గుడివద్దకు వెళ్లాలా? చర్చివద్దకు వెళ్లాలా? బడి వద్దకు వెళ్లాలా? అని నారాయణపురం గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇదేం పరిస్థితిరా అని లబోదిబోమంటున్నారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి వచ్చిన యూరియా బస్తాలలో కొన్ని సోమవారం బస్టాండ్‌లో ఉండే ఆంజనేయస్వామి గుడివద్ద పంచారు. కొన్ని పంపిణీ కాకపోవడంతో మంగళవారం గ్రామం శివారున ఉన్న శివాలయం వద్ద పంపిణీ చేశారు. ఎక్కడ పంపిణీ చేస్తారో తెలియదు, ఎక్కడకని పరుగులు తీస్తామని రైతులు చర్చించుకుంటున్నారు. ఇకపై గ్రామానికి యూరియా వస్తే గుడుల వద్ద, చర్చిల వద్ద, బడుల వద్ద కాద్దామని వారిలో వారు చమత్కరించుకుంటున్నారు. ఇటువంటి తీరు గత పాలనలో చూడలేదని, ఒక యూరియా బస్తాకు రైతును ముప్పతిప్పలు పెడుతున్నారని మొత్తుకుంటున్నారు. అధికారులు పట్టించుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

హౌస్ అరెస్టులు సిగ్గుచేటు

- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మావుడి శ్రీనివాసులు నాయుడు



మక్కువ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎసాసర్‌సీపీ మండల అధ్యక్షుడు రంగునాయుడులను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



వైఎస్సార్‌సీపీ సాలూరు మండల నాయకుడు దండి శ్రీనును గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు



సీతానగరం: పోలీసుల అదుపులో జెడ్పీటీసీ మామిడి బాబ్జీ



సీతానగరం: కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రహదారిపై ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతానగరం: గృహనిర్బంధంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములు నాయుడు



బలిజిపేట: మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం ఇంటివద్ద పోలీసుల గస్తీ



సాలూరు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు



బలిజిపేట: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఇంటివద్ద పోలీసుల నిఘా

మక్కువ: రైతుల పక్షాన యూరియా కోసం పోరాడేందుకు సిద్ధమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులను అడ్డుకుని హౌస్ అరెస్టులు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను అధికారులకు తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు అన్నదాత పోరుబాట కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించేందుకు జెడ్పీటీసీ, వైఎసాసర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, మండల సర్పంచులు, ఎంపీటీసీసభ్యులు రైతులు మంగళవారం బయలుదేరగా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ నాయకుల ఇళ్లకు వచ్చి హౌస్ అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ఎరువుల కోసం ఏనాడూ ఇబ్బంది పడలేదన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అవసరమైన ఎరువులను రైతులకు అందు బాటులో ఉంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. సుదూర గ్రామాలలో ఉన్న రైతులకు అవసరమైన ఎరువులును గ్రామ వలంటీర్ల ద్వారా అందించారన్నారు. రైతుల పక్షాన నిలబడిన ప్రతిపక్ష నాయకులు, రైతులపై ఈ విధంగా కక్షపూరిత చర్యలు సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఊరిస్తున్న యూరియా..!

- ఆందోళన చెందుతున్న రైతులు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోహన రావు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.మోహన్ రావు

పార్వతీపురంటౌన్: యూరియా రైతును ఊరిస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తిన మోహన్ రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో యూరియా కోసం రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులు యూరియా కోసం రాత్రి పగలు తపిస్తున్నారని, అయినా యూరియా దొరకడం లేదని, తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు, అధికారులు రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడం విఫలమయ్యారని విమర్శించారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులకు యూరియా సరఫరాలో జిల్లా యంత్రాంగం విఫలమైందన్నారు. అధికారులు ప్రకటనలు పక్కన పెట్టి క్షేత్రస్థాయిలో రైతుల అవసరాలను గుర్తించి యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, పార్టీ పార్వతీపురం మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



గర్భిణులను తనిఖీచేస్తున్న డాక్టర్ పి. ఉషారాణి

సీతానగరం: గర్భిణులు రక్తహీనతకు గురి కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రసవ సమయంలో ఆస్పత్రుల్లో చేరాలని మండల పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం పలు గ్రామాలనుంచి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులను స్థానిక పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంల సహకారంతో ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గర్భిణుల ఆరోగ్యం బాగా ఉండాలనే సంకల్పంతో ఐసీడీఎస్ అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సమకూరుస్తోందన్నారు. గర్భిణుల్లో ఎనీమియాను నివారించడానికి పౌష్టికాహారం దోహదపడుతుందన్నారు. ప్రతినెలలో ఓ పర్యాయం హిమోగ్లోబిన్ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. రక్తహీనత ఎక్కువగా ఉన్నప్పుడు ఐరన్‌సుక్రోజ్ మందు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఈ క్రమంలో 30 మంది గర్భిణులను తనిఖీ చేసి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్వీరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.